

# బాధ్యత

## ప్రఫుల్ల చంద్ర

నట లుటేరా బిరుదాంకితుడు పరమ హింసగారికి నాలుగేళ్ల నుండి ఒక్కటంటే ఒక్క హిట్ సినిమా కూడా లేదు. అన్నదానాలు చేసి, బహుమతులిచ్చి, చివరకు సినిమా ఫ్రీగా చూపిస్తా మన్నా జనం పారిపోయారు! అభిమానులకు చలిజ్వరం వచ్చేసి హిట్, హిట్ అని కలవరించగా నిర్మాతలూ, దర్శకులూ గాభరాగా క్యాబరే డాన్స్ చేశారు.

చివర ప్రయత్నంగా వాళ్లంతా రచయిత తిరుడారావుని పట్టుకున్నారు. అతగాడు పాతిక పాత సినిమాల కషాయం తీసి విదేశీ క్యాసెట్ల పులుసుతో కలిపి బూతులు కుమ్మరించి విచిత్ర వంటకం చేయగా రెండేళ్ల షూటింగ్ పూర్తయి బొమ్మ జనంలోకి పోయింది.

హిట్!...హిట్!... ఆరేళ్ల విరామం తర్వాత పరమహింసగారి పిక్చర్ పిచ్చ హిట్! అభిమానులు ఆనందతాండవం చేస్తే, బయ్యర్‌లు కొత్త గల్లా పెట్టెలు కొనుక్కున్నారు. డబ్బింగ్ కోసం కాపీ రాయుళ్ల డబ్బు విరజిమ్మారు. అంతలో -

అలాంటి అశ్లీల చిత్రాన్ని వదిలినందుకు ఒక పత్రికా విలేకరి సెన్సార్ సభ్యుల్ని నిలదీస్తే, వాళ్లు రివైజింగ్ కమిటీని అడగమన్నారు. ఆ వివరాలు పత్రికల్లో వచ్చాయి.

అంతే, అంటుకుంది. చిత్రాన్ని నిషేధించాలని మహిళా సంఘాలూ, ఒకరిద్దరు శాసనసభ్యులూ నిరసనలూ, ధర్నాలూ ప్రారంభించారు.

తన్మయంగా తాగుతున్న బ్రాందీల్లో బల్లి పడినట్టు అయింది. రాష్ట్రం నాలుగు మూలల నుంచి అభిమానులను రప్పించాడు నిర్మాత. నిరసనలకు వ్యతిరేకంగా ప్రచారం చేయవలసిన పాయింట్లను వివరించాడు రచయిత తిరుడారావు.

తిరుడారావు చెప్పినదంతా విని రెచ్చిపోయిన అభిమానులు రకరకాల నినాదాలతో పెద్ద ఊరేగింపు జరపాలని నిర్ణయించారు.

అనుకున్నట్టుగానే ఊరేగింపు బ్రహ్మాండంగా జరిగింది. ఆ తర్వాత జరిగిన బహిరంగసభలో ఉపన్యసించి గొప్ప నైతిక విజయం సాధించిన వాడిలా తిరుడారావు ఇంటిలో అడుగు పెట్టగానే - ఇంటిలో అంతవరకూ వేడివేడిగా జరుగుతున్న చర్చ ఆగిపోయింది. కొడుకు ముఖం చాటేసి బయటకు పోగా, భార్య కిచెన్‌లోకి వెళ్లిపోయింది. కూతురు ప్రదీప్తి ఒక క్షణం తండ్రి వైపు చూసి, ఏదో చెప్పబోయి, చెప్పకుండానే బెడ్‌రూంలోకి వెళ్లిపోయింది.

అన్నట్లు - ప్రదీప్తి అత్తవారింటి నుంచి ఎందుకొచ్చిందో - వాళ్లేం చర్చించుకుంటున్నారో అంతా తనని చూసి ఎందుకు మౌనం వహించారో అర్థంకాక నెమ్మదిగా కిచెన్‌లోకి వెళ్లి భార్యని అడిగాడు.

"అమ్మాయి వచ్చేసింది... మామగారు ఉంటున్న ఇంటిలో తను ఉండలేనంటోంది" అందామె మాటలకు తడుముకుంటూ.

తిరుడారావు కంతా అయోమయంగా ఉంది. "ఏం? ఎందుకని?" అన్నాడు.

"ఆయన... ఆయన ... వావి వరుసలు మరిచిపోయి..." ఇంక చెప్పలేక పోయిందామె.

తిరుడారావు ఆవేశంతో ఊగిపోయాడు.

వియ్యంకుడు భీష్మారావు క్రమశిక్షణలో చండశాసనుడు! నీతి నియమాల్ని పాటించే నిప్పులాంటి మనిషి! ఆ నిప్పుకే చెద పట్టిందంటే...

బెడ్‌రూం నుంచి వస్తున్న ప్రదీప్తిని ఆపి అడిగాడు ఏం జరిగిందని.

ఆమె కన్నీరు పెట్టుకొని బాత్‌రూం వైపు పరుగెత్తింది.

★ ★ ★

రండి బావగారూ! మీ కోసమే ఎదురు చూస్తున్నా" ఎదురొచ్చి తిరుడారావుని ఆప్యాయంగా ఆహ్వానించాడు భీష్మారావు!

ఆ నక్క వినయం చూసి కుత కుత ఉడికిపోయాడు తిరుడారావు. వియ్యంకుణ్ని చెడామడా తిట్టిపోసి బుద్ధి చెప్పాలని వచ్చిన తిరుడారావుకి నోట మాట రాలేదు. వియ్యపురాలు వచ్చి పొడిపొడిగా పలకరించి హడావుడిగా వెళ్లిపోయింది. కొత్తగా ఉంది ఆమె తరహా. భీష్మారావు కొంటెగా కన్నుగీటి తన గదిలోకి వెళ్లిపోయాడు. ఉషారుగా ఈలవేస్తూ అద్దంలో వివిధ భంగిమల్లో తన అందాలు చూసుకొని మురిసిపోతున్న అరవై ఏళ్ల భీష్మారావుని చూసి కొయ్యబారిపోయాడు తిరుడారావు.

"ముసలి మన్మధుని లాగ బాగానే ఉన్నారు లెండి!" జోక్ చేశాడు తిరుడారావు తనూ గదిలో ప్రవేశిస్తూ.

"వయసు తెలియనివ్వదు నా చర్మం! అందుకు ఏ సబ్బు వాడుతున్నానో తెలుసా?" అని గలగలా నవ్వేసి "బావగారూ, సినిమా ఫీల్డులో ఉన్నారు కదా! నన్ను హీరోగా పెట్టుకొని సినిమా తీయ రాదూ? పిట పిట లాడే గుంటలతో స్టెప్స్ వేయాలని ఉంది బావా" చిన్న పిల్లాడు మారాం చేస్తున్న ధోరణిలో అన్నాడు భీష్మారావు.

అంతటితో ఆగక కొత్తగా వస్తున్న హీరోయిన్ల అందచందాలను పట్టపగ్గాలు లేకుండా వర్ణించడం మొదలు పెట్టాడు.

“అవేం మాటలు బావగారూ! మీ నోట అలాంటి మాటలు...'' లబలబలాడాడు తిరుడారావు.

“మరిచి పోయారా బావగారూ! అవన్నీ మీరు రాసిన డైలాగులూ! మీ హీరోల నోట పలికించిన డైలాగులే! చూసేవారి కళ్లలోనే అశ్లీలం ఉందిగాని నా డైలాగులలో లేదని మీరే చాలాసార్లు సెలవిచ్చారు కూడా!” గలగలా నవ్వేసి “నా డైలాగ్ డెలివరీ ఎలా ఉంది బావా! హీరోగా పనికొస్తానా లేదా?” అని నిలదీశాడు భీష్మారావు.

“మీకేమైనా పిచ్చా బావగారూ! ఈ వయస్సులో మీకు హీరో వేషం ఏమిటి?”

“డెబ్బయి ఏళ్లవాళ్లు కాలేజీ స్టూడెంట్‌గా నటిస్తే ప్రజలు చూసి చావడంలేదా? వాళ్లకి అభిమాన సంఘాలు లేవా? నా వయస్సు అరవయ్యే! పైగా నా చర్మం నా వయసు తెలియనివ్వదు కూడా.

అది వేళాకోళమో కాదో అర్థం కాలేదు గాని వియ్యంకుడు మారిపోయాడన్న విషయం మాత్రం స్పష్టంగా అర్థం అయింది తిరుడారావుకి. దానితో తను వచ్చిన పని కూడా జ్ఞాపకం వచ్చింది. తాడో పేడో తేల్చుకోడానికి సిద్ధపడుతూ -

“మీ కోడలు మా ఇంటి కొచ్చేసింది'' అన్నాడు.

“వచ్చేసిందీ?! నేనూ అలాగే అనుకున్నాను. పిచ్చిగుంట! ఒంటి పిటపిటలే గాని బుద్ధి రెపరెపలు లేనేలేవు దానికి! హ...హ...హ...'

అలాంటి మాటలెన్నో తిరుడారావు సినిమాల కోసం రాశాడు. అయితే ఆ మాటలు తెరమీద మనుషులకు సంబంధించినవి. అప్పుడా మాటలు అశ్లీలం అనిపించలేదు. బాధ కలగలేదు. కాని అలాంటి మాటలే తన ప్రియపుత్రిక గురించి స్వయంగా దాని మామగారే ఉపయోగించడం భరించలేక పోయాడు తిరుడారావు.

“ఇంత వయసొచ్చి.... కోడలి గురించి ఇలాగేనా మాట్లాడడం?” భగ్గుమన్నాడు.

ఎలకతో చెలగాటం ఆడి, ఆడి - ఇంక చీల్చి చెండాడడానికి సిద్ధం అయే బావురు పిల్లి మాదిరి వియ్యంకుడి వైపు చూసి “అత్తతో వెకిలిగా ప్రవర్తించే అల్లుడిని సమర్థిస్తూ ఊరేగింపులు జరిపిన నీకు - కోడలి గురించి నేనాడిన మాటలు అశ్లీలంగా కనిపించడం వింతగా ఉందోయ్'' అన్నాడు భీష్మారావు ఏకవచన ప్రయోగంలోకి దిగుతూ.

తిరుడారావు ముఖం జేవురించింది. ‘అది సినిమా! ఇది జీవితం! సినిమాలో చూపినదంతా జీవితంలో చేయకూడదు కదా'' అన్నాడు మాటలకు తడుముకుంటూ.

“ఏం? ఎందుకని? చేయకూడని పనులు, ఆడకూడని మాటలు సినిమాల్లో ఎందుకు చూపించాలి?'' భీష్మారావు స్వరం ఖంగుమంది.

“సినిమా అంటే వ్యాపారం! కోట్లతో వ్యాపారం! ప్రజల ఆనందం కోసం అశ్లీలాలూ, అసహజాలూ తప్పవు మరి” అన్నాడు తిరుడారావు అలవాటైన ధోరణిలో.

“వ్యాపారం పేరుతో లాభాల మూటల కోసం మన సంస్కృతీ సంప్రదాయాలను నాశనం చేసిన బ్రిటిష్ వాళ్లని తరిమి కొట్టిన దేశం ఇది! మళ్లీ మీరు తయారయారు! మీలాంటి వాళ్లనేం చేయాలట?'' ఆవేశంతో ఊగిపోతూ అడిగాడు భీష్మారావు.

ఆ ఆవేశం చూసి ఒణికిపోయాడు తిరుడారావు. అభిమానులతో సభలలో మాట్లాడినట్టు ఇక్కడ కుదరదు. అయినా - “విదేశీ విచ్చలవిడి శృంగారాన్ని మన టీవీల్లో చూపించడం లేదా? మనవాళ్లు చూడడం లేదా?'' సంజాయిషీ ఇస్తున్నట్లు అన్నాడు తిరుడారావు.

ఆటోమాటిక్ గన్ నుండి వెలువడుతున్న తూటాల్లాగ నవ్వాడు భీష్మారావు.

“పక్కింటి వాడు నీ ఇంటికి నిప్పు పెట్టడానికి వస్తే నువ్వేం చేస్తావయ్యా? వాడిని తన్ని పంపిస్తావా? పెట్రోలు డబ్బా చేతికిచ్చి సాయం చేస్తావా? ఎవడో పోకిరి వెధవ మీ అమ్మాయి చెయ్యి పట్టుకుని లాగితే నువ్వేం చేస్తావ్? వాడి చెమడా లూడదీస్తావా, వాడితో చేరి కన్ను కొడతావా? చెప్పు! నువ్వేం చేస్తావ్?'' గర్జించాడు భీష్మారావు.

తిరుడా తల వాలిపోయింది. మాట పడిపోయింది. అతడిని ఆ పరిస్థితి నుండి రక్షించడానికా అన్నట్లు అక్కడికి ప్రదీప్తి వచ్చింది.

“ఏమిటమ్మా! నువ్వు... నువ్వు... ఇలా వచ్చేసేవేమిటి!'' దిగ్భ్రాంతిచెందాడు తిరుడా.

“ఆడపిల్ల మామగారింటికి రాక ఎక్కడికెళ్తుందయ్యా!'' నవ్వేశాడు భీష్మారావు.

తిరుడారావుకి అంతా అయోమయంగా ఉంది. ఆవేశమూ తన్నుకొచ్చింది.

“ఊ! మామగారట! మామగారు! ఆ పదాన్ని ఉచ్ఛరించే అర్హతే లేదు నీకు! నీలాంటి నీచుడు.. నీలాంటి...'' ఇంకా ఏదో అనబోయాడు తిరుడారావు.

“నాన్నా!'' అన్న గర్జన విని అవాక్కు అయి ప్రదీప్తి వైపు తిరిగాడు. ఆమె కళ్లు నిప్పుల్లాగ మెరుస్తున్నాయి. ‘మా మామగార్ని విమర్శించే నైతికస్థాయి నీకెక్కడిది నాన్నా! ఊరికే నోరు పారేసుకోకు!”

“అదేమిటమ్మా; అలా అంటావ్! ఈయన గారేమో వావి వరుసలు మరిచిపోయి పశువులాగ ప్రవర్తిస్తున్నాడని గోలపెడుతూ మా ఇంటి కొచ్చేసింది నువ్వే... ఇప్పుడేమో నీ తరపున పోట్లాడుతున్న నన్ను... నన్ను...''

“ఆగు నాన్నా! మామగారు వావి వరుసలు మరిచి పోయారన్నాను గాని మిగిలినదంతా నీ ఊహ మాత్రమే! మా మామగారు వావివరుసలు మరిచిపోయి... మరిచిపోయి... నన్ను స్వంత కూతురులాగ చూసుకుంటున్నారు!”

ఇదంతా మామా కోడలూ కలిసి ఆడుతున్న నాటకం అని హఠాత్తుగా అర్థం అయింది తిరుడారావుకి. కానీ ఎందుకీ నాటకం?

“ప్రజలకు దారి చూపవలసిన మీలాంటి సృజనాత్మక రచయితలు ఆత్మవంచన చేసుకుంటూ అశ్లీలానికి అమ్ముడుపోవడం చూస్తోంటే బాధగా ఉంది బావగారూ! వావి వరుసలు మరిచి పోవడం అన్న ఒక్క మాట పట్టుకొని ఏదో ఊహించుకొని ఆందోళన చెందిన మీకు - సినిమాల్లోని మీ డైలాగులు సమాజంలో ఎలాంటి సంచలనం కలిగిస్తాయో నిజంగా తెలియదా? నేను కాకపోతే మరొకడైనా బూతులు రాయడాన్కి సిద్ధపడతాడు కదాని నేనే రాస్తున్నాననడం ఆత్మ వంచనే. ఎదురుగా ఉన్న పిల్లను ఎవడైనా రేప్ చేసే అవకాశం ఉందని ఎగబడి ముందుగా మీరే రేప్ చేస్తారా? సినిమా కోట్లతో వ్యాపారం. నిజమే. అయితే వ్యాపారం పేరు చెప్పి ప్రజల్ని పాడు చేసే హక్కు ఎవరికీ లేదు. మిమ్మల్ని దారిలో పెట్టే ప్రయత్నంలో భాగంగా నా స్థాయిని మరిచి నేనాడిన మాటలు, చేసిన చేష్టలూ నాకే కంపరంగా ఉన్నాయి. నిత్యం అలాంటి మాటలే రాస్తూ, అలాంటి చేష్టల్నే ప్రోత్సహిస్తూ మీరెంత కృతకంగా జీవిస్తున్నారో చూస్తోంటే అసహ్యం వేస్తోంది. మీరు నా వియ్యంకుడని చెప్పుకోడానికే సిగ్గుగా ఉంది'' అంటూ లోనికి వెళ్లబోయి ఒక క్షణం ఆగి “చివరగా ఒక మాట. రచయితగా మీ బాధ్యతను మీరు గుర్తించి, మిమ్మల్ని మీరు సంస్కరించుకున్న నాడే మీకు మా మధ్య స్థానం ఉంటుంది. లేకపోతే - మళ్లీ మీరీ ఇంటి గుమ్మం తొక్కే పనిలేదు'' అంటూ చరచరా లోనికి వెళ్లిపోయాడు భీష్మారావు.

ప్రదీప్తి ఒక క్షణం నిలబడి - తనూ లోనికి వెళ్లిపోయింది, మామగారికి వత్తాసు పలుకుతున్నట్లు.

ఆ గదిలో తిరుడారావు ఒక్కడే మిగిలాడు.



**లాగలేదు**

‘నీ కొత్త కాపురం ఎలా సాగుతుందే పద్మా’

‘నేనెప్పుడూ లాగి చూడలేదే’

ఆర్.డి.యస్.ప్రకాష్

(భాగ్యనగరం)